


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

ఇప్పటి వరకూ జరిగిన కథ

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

"ఓ సుడిగాలి రేగుతోంది. చెత్తా చెదారాన్ని చుడుతూ ఎక్కడికో తీసుకుపోతుంది. ఎడారుల్లో ఇసక తుఫాన్లు రేగుతాయి. ఇసుకను చుట్టి చుట్టి పై కెగరేసి మరెక్కడో నేలమీదకి దించుతాయి. ఓ శ్రావణం మొదలవుతుంది. వేలకొద్దీ మబ్బులు నింగిని దుప్పట్లా కప్పుతాయి. వర్షం కురుస్తుంది. ఎండిపోయిన బావులన్నీ నీళ్ళు నింపుకుని మళ్ళీ మెత్తబడతాయి. బీటలు వారిన చెరువులు నిండి కప్పల సంతతీ, చేపల సంతతీ వృద్ధి అవుతాయి. ఒక్కో రుతువులో ఒక్కో అద్భుతం. ఆ రుతువుల సొగసును పరికించడానికి ఓ జన్మ చాలదు!" చిన్నగా అన్నారు యజ్ఞప్ప. మదాలస వింటోంది. శాస్త్రిగారు కూడా వింటున్నారు. శ్రీనివాస్ శరద్వతి కూడా మౌనంగా అందర్నీ గమనిస్తున్నారు.

"అవును. రుతువుల సౌందర్యమంతా భూదేవిదే ఆకాశం నిర్లిప్తం. నిర్వికారంగా వర్షాన్ని వర్షిస్తుంది. అంతే. ఆ వర్షం లేనినాడు ప్రకృతీ వుండదు" ఆయనే మళ్ళీ మెల్లగా అన్నాడు. జయ్, అతీం దద్లానీ, స్టిట్సన్, రాబీ మిగతావారందరూ ఆలోచిస్తున్నారు. యజ్ఞప్ప ఏం చెబుతారోనని.

"ఎప్పటిలాగానే ఆకాశం నిర్లిప్తంగా ఉంది. మన పరిస్థితి రుతువు రుతువుకీ మారే ప్రకృతిలా వుంది" మళ్ళీ అన్నారు యజ్ఞప్ప.

"అవును" నిట్టూర్చి అన్నాడు రామజోగి.

"ఏదో అవుతుందని భయపడటం, ఏదో జరగడం, ఆ తరవాత మళ్ళీ సందిగ్ధం – ఇలానే కాలం గడిచిపోతోంది. కాలగతిని ఊహించడం ఎవరి తరం!" నిస్పృహతో అన్నాడు రామజోగి.

"మనిషి ఎంత నిమిత్త మాత్రుడో అంతే బుద్ధిశాలి కూడా. ఒక్క కృష్ణుడు ఊహించినదే కదా జరిగింది. లేదా తన ఊహనే నిజం చేశాడుగా" అన్నారు పరమేశ్వర శాస్త్రి.

"మహాత్ములవి ఊహలు కాదు. సంకల్పాలు. అవి కూడా వజ్ర సంకల్పాలు. తులసి వనంలో తులసి మొక్కల కంటే గంజాయి మొక్కలు ఎక్కువైనాయి. అందుకే మొత్తం పొలాన్ని దున్నించేశాడు. తనయుడు బంధుమిత్ర పరివారంతో బిడ్డలు కూడా ఆహుతి అవుతారని తెలిసే యుద్ధం మొదలెట్టడానికి కారకుడయ్యాడు. మిత్రులారా.. ఇప్పుడు ఊహలో కూడా మనకి అందుబాటులో లేవు. ఒకవేళ ఊహించినా ఆ ఊహలు క్షుద్రమైనవీ వినాశనకరమైనవీ మాత్రమే వస్తున్నాయి" నిట్టూర్చి అన్నారు యజ్ఞప్ప.

భోజనాలయినాయి. శర్మగారికీ, వారి సతీమణికేగాక అందరికీ తెలుసు రాత్రి పదయ్యేలోగా ఎవరిదార్నీ వారు వెళ్ళిపోతారనీ.. అందరూ కలిసి చేసే చివరి భోజనం ఇదేననీ. అందుకే ప్రత్యేకంగా డా.టివిఎన్ శాస్త్రిగారు ఆయన భార్య వంటకాలు చేయించారు.

అద్భుతంగా గుత్తివకాయ కూర, గోంగూర పచ్చడి, ఉల్లిపాయల్ని తొక్కి పచ్చడిలో వేయడంతో గోంగూర పచ్చడికి అమోఘమైన రుచి వచ్చింది .వంకాయ పచ్చిపులుసు, బంగాళదుంప వేపుడు, చేమదుంపల పులుసూ, బెండకాయ కూర, కందిపచ్చడి, అప్పడాలు, వడియాలు, అరటికాయ, పచ్చిమిర్చి బజ్జీలు, సేమ్యా పాయసం, అరిసెలు. వంటలన్నీ అద్భుతంగా కుదిరాయి. ఇక వైష్ణవుల ప్రత్యేక వంటకం పులిహోర సరేసరి. ఆ రంగు సువాసన చూడగానే ఆకలిపుట్టుకొస్తున్నది.

తృప్తిగా భోంచేసి 'అన్నదాతా సుఖీభవ' అని దీవించి కాసేపు నడుం వాల్చారు అందరు. విదేశీయులు కూడా ఆనాడు సాంప్రదాయ భోజనాన్ని భుజించి సంతుష్టులయ్యారు. 'అన్నదాతా సుఖీభవ' అనే పదాలకి అర్థం తెలుసుకుని పొంగిపోయారు.

"జయ్.. మీదేశం నిజంగా గొప్పది" సెల్యూట్ చేస్తూ అన్నారు స్టీట్సన్, డాంటే, రాజోవ్స్కీ.

ఎవరి దారిన వాళ్ళు తమ తమ దుస్తుల్ని చక్కగా పెట్టెల్లో సర్దుకున్నారు. జయ్ ట్రావెల్స్‌కి ఫోన్ చేసి మద్రాస్ వరకూ కారు మాట్లాడుకుంటే, మిగతావారు ట్రైన్స్‌లో తమ టికెట్స్‌ని బుక్ చేసుకున్నారు. డాంటే, స్టీట్సన్, గోర్కీ, రాజోవ్‌స్కీ చెన్నై వరకూ ఫ్లైట్ బుక్ చేసుకున్నారు. ఆ తరవాత అమెరికా ప్రయాణం గురించి చర్చించుకుంటామన్నారు.

దద్లానీ, అతీమ్, శంతను అందరూ ట్రైన్‌లో హైదరాబాద్ వరకు టికెట్లు బుక్ చేసుకున్నారు.

"మీ సంగతి?" రామజోగిని అడిగారు యజ్ఞప్ప.

"నేను ఇంటికి వెళ్తాను. మట్టూతో శృంగి ఆలయానికి వెళ్తాడు. పరమేశ్వర శాస్త్రిగారు కూడా ఆలయానికే వెళ్తానన్నారుగా!" చిన్నగా అన్నాడు రామజోగి. అతను మదిలో 'మధుర' మెదులుతున్నది.

"ఓహ్.. అయితే మేమూ సాయంత్రం మా ఇంటికి వెళ్ళిపోతాం" అన్నది శరద్వతి.

"మరి మీరు?" యజ్ఞప్ప మదాలసల వంక చూస్తూ అడిగాడు శ్రీనివాస్.

"మేమూ ఓ కారు మాట్లాడుకుని హార్స్ లీ హిల్స్ కి వెళ్ళిపోతాం" చిన్నగా అన్నారు యజ్ఞప్ప.

"అందరం కలిసి ఇన్నాళ్ళు ఉన్నాం. ఏదో కొలిక్కిరాక ఎవరిదారిన వాళ్ళం వెళ్ళిపోతున్నాం" అన్నారు మహదేవన్ గౌరీలక్ష్మి.

"అవును అసలు ఎందుకొచ్చామో కూడా అర్ధం కావడంలేదు" అన్నాడు ప్రవస్థి.

"జీవితమూ అంతే. కొంచెం అర్ధం అయినట్టూ, కొంచెం అర్ధంకానట్టూ ఉంటుంది. ఏది అర్ధం కావాలో అది మాత్రం ఎన్నటికీ అర్ధంకాదు" నిట్టూర్చి అన్నాడు గోర్కీ.

"సర్వమూ జరిగేది కాలంలోనే, ఆ ప్రవాహం రకరకాలుగా సాగుతుంది. మన లెక్కలు, మన అంకెలు వేరు. సరే.. ఇంతమందిమి ఒకేచోట గుమికూడి చర్చించుకోవాలని నిర్ణయించింది ఎవరూ? మనమా? కొన్ని ఘోరాలు జరిగాయి. కొన్ని ఉత్పాతాలు వెలుగు చూశాయి. కొందరు స్వార్ధంతో లోకాన్ని భ్రష్టు పట్టించాలని చూశారు. కొందరు 'లోకాస్సమస్తా స్సుఖినోభవంతు' అని దీవించారు. ఇవన్నీ జరిగింది ఎవరి ప్రేరణ వల్ల. గోర్కీ.. ఎవరయినా ఎంతటివారయినా కాలం ఎదుట నిర్వీర్యులే."మెల్లగా అన్నారు పరమేశ్వర శాస్త్రిగారు.

"అంటే అన్నీ కాలానికి వదిలేసి మనం చేతులు ముడుచుకు కూర్చోవాలా?" అసహనంగా అన్నాడు సచేత్ దద్లానీ.

"కొన్నిసార్లు తప్పదు. ముడుచుకు కూర్చోవడం అంత సులభం కాదు నాయనా. అదో సాధన. ఒక విధంగా చెబితే సమయం వచ్చేవరకూ మనని మనం సిద్ధ పరుచుకోవడంలాంటిది.

ఏ సైనికుడూ ప్రతిరోజూ యుద్ధం చెయ్యడు. కానీ కావలసిమత సాధన చేస్తాడు. యుద్ధానికి ఎంతవరకూ సిద్ధమవ్వాలో అంతా సిద్ధమవుతాడు. యుద్ధం రాగానే అప్పుడు విజృంభిస్తాడు. అలాగే, మనమూ ముడుచుకుని కూర్చోనక్కరలేదు. సంసిద్ధులవుదాము. ఏ ప్రళయం వచ్చినా కార్యంలో దూకడానికి సిద్ధంగా ఉందాం. అన్నీ గమనిద్దాం. అన్నిటిని చర్చిద్దాం. బస్.. కావలసింది కొంచెం ఓర్పు.. కొంచెమ గమనిక" అన్నారు డా. టి.వి.ఎన్ గారు.

కొన్ని క్షణాలు మౌనం నాట్యమాడింది. ఫోన్ మ్రోగింది. డాక్టర్‌గారు ఫోన్ తీసి ఓ క్షణం విని, "జయ్ .. మీ కారు సిద్ధంగా ఉందిట. పంపమంటారా అని శ్రీనివాసా ట్రావెల్స్ అతను అడుగుతున్నాడు" అన్నారు.

"యా.. పంపమని చెప్పండి. సిద్ధంగానే ఉన్నాంగా. నాలుగున్నరకి బయలుదేరితే ఎనిమిదిన్నర తొమ్మిదింటికి మద్రాసు చేరుకుంటాం" అన్నాడు జయ్.

అదేమాట ట్రావెల్స్ వారికి చెప్పి ఫోన్ పెట్టేశారు డాక్టర్. ఆ ట్రావెల్స్ యజమాని శ్రీమాన్ వేంకట శ్రీనివాస శర్మ ఆయనకి తెలిసినవాడే.

జయ్ లేచి తన సూట్‌కేసులూ, రాబీవి తెచ్చి వరండాలో పెట్టాడు. అందరూ బిలబిలా వరండాలోకి వచ్చారు. రాబీ మాత్రం తనకి సంబంధం లేనట్టు మౌనంగా ఉన్నాడు. జరిగిన చర్చ అంతా కూడా విన్నాడు.. అర్థమూ అయింది. వచ్చి వరండాలోని ఓ కుర్చీలో కూర్చున్నాడు. అతన్నే చూస్తున్నాడు గోర్కి.

"వెల్.. టైమ్ టూ డిపార్ట్" అన్నాడు శ్రీనివాస్.

"యా" అన్నాడు జయ్.

"మిస్టర్ రాబీ. నా జీవితంలో అద్భుతమైన క్షణాలు మీతో ఉన్నవే. ఓ ఆత్మని మీద్వారా కలుసుకోగలిగాను. ఆ ఆత్మతో మధ్యప్రదేశ్ దాకా పయనించి అక్కడ శరద్వతిని కలుసుకోగలిగాను. ఆమెతో ఆంధ్రా వచ్చి 'గుడిమల్లం'లో పెళ్ళి చేసుకోగలిగాను. సీదా సాదాగా గడిచే నా జీవితంలో వచ్చిన ఇన్ని మలుపులకీ కారణం మీతో పరిచయమే. మీ పరిచయం వలన ఎంత సంతోషిస్తున్నానో, మీరిప్పుడు చెన్నై వెళ్ళిపోతూంటే, అంతే బాధపడుతున్నాను. అయినా కలవడం, విడిపోవడం సహజం. జీవితంలో తప్పనివి కూడా. అందుకే మీకు నా వీడ్కోలు" నమస్కరించి అన్నాడు శ్రీనివాస్.

"నాతో చెప్పాలంటే మీరు కాదు. నేను చెప్పాలి ధన్యవాదాలు. నేను విదేశీయుడ్ని. అందునా అహంకారం అభిజాత్యం కలిగిన అమెరికన్‌ని. తెల్లవాడ్నన్నే మూర్ఖత్వం పుట్టుకనించే పెంచుకుని పెరిగినవాడిని .నేను ఇండియాకి రావడానికి కారణాలు నికోల్ – నా గర్ల్‌ఫ్రెండు. తను ఇండియాని దర్శించకపోయినా, యీ దేశం గురించి గంటలు గంటలు గొప్పగా చెపుతుండేది. తను పూర్తి అమెరికన్ కాదు. తండ్రి అమెరికన్, తల్లి ఫ్రాన్స్. ఆమెకి ఎవరూ యీ దేశాన్ని గురించి నూరిపోశారో నాకు తెలియదు. కేవలం ఒక కుతూహలం వల్ల యూనివర్సిటీ గ్రాంట్ పొంది వచ్చాను. ఈ తిరుపతికి రావడం, ఇక్కడ నేను మీ భాషలో మాట్లాడి స్పృహ కోల్పోవడం అంతకుముందు విలియమ్స్ అనే ఆత్మతో మాట్లాడటం ఇవన్నీ నాకే నమ్మశక్యంగా లేవు. కానీ నమ్మక తప్పదు. రోజుల తరబడి నేను స్పృహలో ఉండక పోవడమే సాక్ష్యం. నా వల్ల మీరందరూ చాలా ప్రాబ్లమ్స్ ఫేస్ చేశారు. మొదట మీ ఫామిలీ మెంబర్స్‌కి దూరం కావడం. రెండు – అనిశ్చిత స్థితిలో నెలల తరబడి గడపడం. సరే – మిగతా విషయాల జోలికి వెడితే అదో అగాధం. అందుకే, చేతులెత్తి మిమ్మల్నందర్నీ అర్థిస్తున్నాను. నన్ను క్షమించండి. నా గత జన్మ సంగతి ఏమైనా యీ జన్మ మాత్రం దుర్భరంగా ఉంది" ఓ బాధతో ఉద్విగ్నతతో అన్నాడు రాబీ. కాసేపు మాట్లాడినదానికే అతని కంఠం చెమటతో తడిసిపోయింది. అది, అతనిలోని ఘర్షణను అందరికీ తెలిపింది.

"బాధ పడకండి రాబీ. జరిగినవాటన్నిటికీ మీరు కారణం కాదు. మీరూ నిమిత్త మాత్రులే. ఈ సంఘటన వెనక ఉన్న పరమార్థం తెలియాలంటే, బహుశా మరో జీవితకాలం పట్టొచ్చు. దు నాట్ ఫీల్ గిల్టీ. మిమ్మల్ని కలుసుకోవడం నిజంగా మా పూర్వజన్మ సుకృతమే, మరో జన్మరహస్యాల తలుపు మీద్వారా తెరుచుకుంది" అన్నారు పరమేశ్వరశాస్త్రిగారు.

"అవును.. విలియమ్స్ ద్వారా ఆత్మలు ఉన్నాయని నిర్ధారణ అయింది. అంతేకాదు.. అది కొందరి శరీరాన్ని ఆశ్రయించి సంభాషించగలవనీ రుజువైంది. ఉదాహరణ శ్రీనివాస్, ఏళుమలై. అలాగే జన్మలు ఉన్నాయని స్పష్టంగా రుజువైంది. ఎక్కడో అమెరికాలో పుట్టిన మీరు తిరుపతిలో తెలుగు మాట్లాడటం ఏమిటి? మార్కెట్టు అప్పటిలా లేదని చెప్పడం ఏమిటీ? తిరుమణ్ణామలైలో సంభాషణ, మహా భారత యుద్ధపు ఆయుధాల విషయం చెప్పడం.. ఇవన్నీ అద్భుతమైన విషయాలే. మా పూర్వీకులు చెప్పిన దాన్ని గురించి లోతుగా ఆలోచించి విశ్లేషించదగిన విషయాలే. మీరు గనక రాకపోతే, ఇంతమందిమి, అదీ అపరిచితులం ఒక్కచోట కూడి వుండటం సంభవమయ్యేదే కాదు" స్పష్టంగా అన్నాడు రామజోగి.

"అవునవును. ముమ్మాటికీ నిజం" అన్నారు గోర్కీ, స్టిట్సన్, రాజోస్కీ, డాంటే.

"అవేమీ నాకు తెలీదు. వీలున్నంత త్వరగానే యీ దేశాన్ని వదిలి వెళ్ళిపోతా. కానీ, ఫ్రెండ్స్, మిమ్మల్నెవర్నీ ఏనాటికీ మర్చిపోను. అసలు మర్చిపోయేంత విషయాలు కావుగా!" లేచి నిలబడి అన్నాడు రాబీ వెబ్‌స్టర్.

అందరూ లేచారు "ఇదిగో" అంటూ డాక్టరుగారి భార్య ఓ వెండి వేంకటేశ్వర స్వామి డాలర్ రాబీకి ఇచ్చింది. ఆ డాలర్ ఓ పేద్ద వెండి గొలుసుకి వేలాడుతోంది.

"నైస్ గిఫ్ట్. ఐ షల్ కీప్ ఇట్ ఫరెవర్" అన్నాడు రాబీ.

"జయ్. కొన్ని స్వీట్స్ పాక్ చేసి ఇవ్వనా" డాక్టరుగారి భార్య అడిగింది.

"పొట్ట ఫుల్‌గా ఉందమ్మా. ఇంటికి వెళ్ళేసరికి తను డిన్నర్ సిద్ధంగా ఉంచుతుంది. ఇందాకే నా వైఫ్‌కి ఫోన్ చేసి చెప్పాను" ధన్యవాదాలు తెలుపుతున్నట్లుగా తలవంచి అన్నాడు జయ్.

టాక్సీ వచ్చింది.

బిలబిలా అందరూ బైటకొచ్చారు. జయ్, రాబీ, సూట్‌కేసుల్ని శ్రీనివాస్ ,మట్టూ తీసుకొస్తున్నారు. డిక్కీ ఓపెన్ అయింది. డ్రైవర్ కూర్చుని ఉండే డోర్ ఓపెన్ అయింది. కారులోంచి దిగుతున్నది

"ఏళుమలై"

"ఇంకెక్కడికీ వెళ్ళాలని లేదు" ముక్తసరిగా అన్నది మహా కన్యాదేవి.

"సరే అమ్మా అలాగే. తిరుత్తణి, అక్కడికో ఇరవై మైళ్ళ దూరంలో ఉండే షొ లింగర్ (ఘటికాచలం), అక్కడికో పదిమైళ్ళ దూరంలో ఉండే మహిషాసుర మర్దిని గుడీ చూసుకుని వచ్చేస్తే మీ యాత్ర సఫలమౌతుంది. తిరిగి వచ్చేప్పుడు తిరువళ్ళూరు వీర రాఘవ స్వామి గుడి చూసేస్తే సంపూర్ణ యాత్రాఫలం లభిస్తుంది" అన్నాడు ఆశ్రమం నించీ వీరిని అనుసరించి వస్తున్న ఆశ్రమ వాసి.

మహామాయ చిన్నగా, "బాబూ ప్రస్తుతానికి వారిని ఇబ్బంది పెట్టొద్దు. ఆరోగ్యం కుదుట పడ్డాక నేను మాట్లాడి మీతో చెబుతాను. అప్పుడు మీరే ఏర్పాట్లు చూద్దురుగాని" అన్నది ఆశ్రమ వాసితో.

"అమ్మా వీర రాఘవ స్వామి గురించి నేను విన్నాను. స్వామి పేరు మీద కాలికి కంకణం లాంటిది వేసేవారు. చాలా గొప్ప దేవాలయం అట" అన్నాడు హనుమంతు ఉత్సాహంగా.

"అంతేకాదండీ, ఘటికాచలం అంటే షోలింగర్‌కి మించిన ఆంజనేయస్వామి గుడి భూమ్మీదే లేదు. రెండు కొండలున్నాయి. పెద్ద కొండమీద నరసింహస్వామి. అబ్బ..అబ్బ సింహం మీద గుడి కట్టినట్లనిపిస్తుంది. చిన్న కొండ ఆంజనేయస్వామిది. ఆ స్వామికి నాలుగు చేతులు, సాలగ్రామ మాల ఉంటాయి. మహా శక్తిపరుడైన ఆంజనేయుడాయన. ఎంత ఘోరమైన దెయ్యాలూ భూతాలైనా ఘటికాచలం మెట్లెక్కితే చాలు... దెబ్బకి ఎగిరిపోతాయి మానసిక రోగుల్నీ, దెయ్యం పట్టిన వాళ్ళనే కాదు, జీవితంలో దెబ్బ తిన్నవారు కూడా ఘటికాచలం దర్శించి సంతృప్తిగా వెళ్తారు. మా నాయనమ్మగారికి 86 ఏళ్ళు. ఇప్పటికీ ప్రతినెలా పౌర్ణమిరోజున ఘటికాచలంలోని రెండు దేవాలయాల్నీ దేవతా మూర్తుల్నీ దర్శిస్తుంది. ఇంకో విషయం ఏమంటే, ఎంత దిష్టివున్నా ఘటికాచలం గాలి తగిలితే చాలు మబ్బు తొలిగిపోయినట్టు దిష్టి తొలిగిపోతుంది" ఉత్సాహంగా వివరించాడు ఆశ్రమవాసి. మహామాయ మిగతా విషయాల్ని శ్రద్ధగా వినలేదుగానీ, 'దిష్టి' విషయం మాత్రం శ్రద్ధగా విన్నది.

"ఇంకో రహస్యం చెప్పనా అమ్మా.. స్వామి పడుకుని ఉంటారు. అమ్మబాబోయ్.. అంత పెద్ద స్వామిని మరెక్కడా మనం చూడలేము. అంతేకాదు అక్కడ కర్ర బొమ్మలు ఉంటాయి. వధువువీ, వరులవీ. పిల్లాడికి పెళ్ళికాకపోతే వధువు బొమ్మనీ, పిల్లకి పెళ్ళికాకపోతే వరుడి బొమ్మనీ కొని మొక్కుకుంటారు. పెళ్ళయ్యాక ఆ బొమ్మతో వధూవరులు వచ్చి స్వామికి మొక్కు చెల్లిస్తారు. ఇది పల్లెటూరి వారికి తెలిసినంతగా పట్నం వారికి తెలీదు" ఉత్సాహంగా తనకి తెలిసిన విషయాలు చెప్పాడు ఆశ్రమ వాసి.

"అలాగా" అన్నది మహామాయ.

"అమ్మా, 108 విష్ణు క్షేత్రాల్లో ఇది చాలా గొప్ప క్షేత్రం. ఇక్కడి విష్ణువుని వీరరాఘవ స్వామి అనీ, లక్ష్మీ అమ్మవారిని కనకవల్లి అనీ పిలుస్తారు. 15, 16 వందల ఏళ్ళ క్రితమే యీ క్షేత్రం ప్రసిద్ధమైనది. వీరరాఘవ స్వామి వారిని 'వైద్య వీర రాఘవస్వామి' అని కూడా పిలుస్తారు. మొండి రోగాలు యీ క్షేత్రాన్ని దర్శించుకుంటే తగ్గుతాయి" అన్నాడు ఆశ్రమవాసి.

"అమ్మవారిని 'వసుమతి' అనికూడా పిలుస్తారమ్మా. పులిహోర, దద్దోజనం అయితే అద్భుతంగా ఉంటాయి. అమ్మా, ఇంత దూరం వచ్చారు. తిరుత్తణి, తిరువళ్ళూరు, ఘటికాచలం (షోలింగర్) కూడా తప్పనిసరిగా దర్శించుకోండమ్మా. నేను మీ వెంటనంటే ఉంటాను. గుడి అర్చకస్వాములు, అధికారులూ కూడా మన ఆశ్రమానికి బాగా తెలిసున్నవారు, గౌరవించేవారు. మీ పాదాలు కందకుండా దర్శనాలని తృప్తిగా చేయిస్తానమ్మా. అంతేకాదు.. అమ్మకి చెప్పలేనంత దిష్టి వుంది. అది తొలగాలంటే ముందు ఘటికాచలం దర్శిద్దాం. నామాట కాదనకండి" ప్రాధేయపడ్డాడు ఆశ్రమవాసి.

"అలాగే తమ్ముడూ.. రేపు వెళ్తాము. విశ్రాంతి తీసుకో" కళ్ళు విప్పి ఆ కుర్రవాడ్ని చూసి ప్రసన్నంగా అన్నది మహా కన్యాదేవి.

చటుక్కున అతను మహా కన్యాదేవి పాదాల్ని తలకి ఆనించుకుని గబగబా బయటికి వెళ్ళిపోయాడు. అతని కళ్ళల్లోంచి కన్నీరు కారడం హనుమంతే కాదు మహామాయ కూడా స్పష్టంగా చుసింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments